క్లుప్తంగా

బుగ్గ దేవాలయం పూజారిపై ఫిర్యాదు

బెల్లంపల్లి: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధి బుగ్గరాజరాజేశ్వరస్వామి దేవాలయం పూజారి శ్రీరాంభట్ల వేణుగోపాల్‌శర్మపై కాసిపేట మండలం బుగ్గగూడ గ్రామానికి చెందిన గుండ భీమక్క గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. భక్తులు లేని సమయంలో వేణుగోపాల్‌వర్మ తనను దుర్భాషలాడి తీవ్ర భయభ్రాంతులకు గురి చేశారని పేర్కొంది. ఆలయం ఆవరణలో తాను నిర్వహిస్తున్న కొబ్బరి కాయల దుకాణం బంద్ చేయిస్తానని, గుడి ఆవరణలోకి రానీయకుండా చేస్తానని బెదిరించారని తెలిపింది. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరింది.

ఇసుక డంపులు సీజ్

జన్నారం: మండలంలోని బాదంపల్లి గ్రామంలో నిలువ ఉంచిన ఇసుక డంపులను గురువారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అక్రమ ఇసుక నిల్వలు ఉన్నాయనే సమాచారంతో తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి ఆదేశాలతో ఆర్ఐ భానుచందర్, గ్రామ కార్యదర్శి, పోలీసు సిబ్బందితో కలిసి గ్రామంలో పరిశీలించారు. 9 చోట్ల అక్రమ నిల్వలు గుర్తించి వాటిని సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. మొత్తం 168 ట్రాక్టర్ల ఇసుక ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

వసతి గృహంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

లక్సెట్టిపేట: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో వెంకట్రావ్‌పేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సతీశ్, సిబ్బంది మౌనిక, లక్ష్మణ్‌స్వామి, విజయలక్ష్మి, చిలుకమ్మ, సునీత, వార్డెన్ రాజగోపాల్ పాల్గొన్నారు.

నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వరద ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

కోటపల్లి: ప్రాణహిత తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ఎస్సై రాజేందర్ కోరారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వెంచపల్లి, జనగామ, ఆలుగామ, సిర్సా, అన్నారం ప్రాంతాల్లో వరద ఉధృతి పెరుగుతున్నందనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నదిలోనికి పడవలు, చేపల వేటను నిషేధించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న డీసీఎం వ్యాన్



జైపూర్: మండలంలోని ఇందారం–టేకుమట్ల క్రాస్‌రోడ్డు సమీపంలో రాజీవ్ రహదారిపై గురువారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన డీసీఎం వ్యాన్ వేగంగా చెట్టును ఢీకొట్టింది. వ్యాన్ డ్రైవర్ నీరజ్‌కుమార్‌కు స్వల్ప గాయాలు కాగా, 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు కార్మికులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న తమకు పెండింగ్ వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఏరియా ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేశారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. గడిచిన ఆరు నెలల నుంచి ఏజెన్సీ కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి కాంట్రాక్టు కార్మికులు వరలక్ష్మి, మల్లీశ్వరి, వెంకటస్వామి, అవినాష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి భవనం సిద్ధం



- అన్ని రకాల సౌకర్యాలతో ఏర్పాట్లు పూర్తి
- 13న ప్రారంభం

లక్సెట్టిపేట: మున్సిపల్ పరిధిలో నిర్మించిన ముప్పై పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెల 13న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆసుపత్రిని ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. అన్ని రకాల సౌకర్యాలు, హంగులతో ఆసుపత్రి భవనం కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో నిర్మించగా, రోగులకు సరిపడా సౌకర్యాలు, సామగ్రి అన్ని విధాల సమకూర్చారు. పట్టణంలో ఆసుపత్రి ప్రారంభం కానుండడంతో లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండనుంది. 55మంది వైద్య సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు.

అభివృద్ధి కోసం కృషి



ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాను. ఈ నెల 13న ఆసుపత్రి ప్రారంభం అవుతుంది. కళాశాల భవనం, ఆసుపత్రి భవనం రెండు పూర్తి చేశాను. ప్రజలకు విద్య, వైద్యం చాలా ఉపయోగకరంగా ఉంటాయి. త్వరలో సిబ్బందిని నియమించి కొరత లేకుండా చేస్తాను. ఇంకా పలు అభివృద్ధి పనులు చేపడుతాను. ప్రజల సేవ కోసమే కష్టపడుతున్నాను. ప్రజలు వినియోగించుకోవాలి.

– కొక్కిరాల ప్రేంసాగర్ రావు, ఎమ్మెల్యే

సిబ్బంది కోసం నివేదిక పంపించాం



ఆసుపత్రి భవనం పెద్దది కావడంతో సిబ్బంది చాలా అవసరం ఉంటుంది. ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు చొరవతో ఆసుపత్రి భవనం పూర్తయింది. మూడు సంవత్సరాలు చాలా ఇబ్బందితో విధులు నిర్వహించాం. చాలా సంతోషంగా ఉంది. రోగులకు అన్ని విధాల సేవలు అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉన్నారు. అధికారులు పూర్తిస్థాయిలో సిబ్బందిని పంపిస్తే ఇంకా బాగుంటుంది.

– శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్

అల్లుకున్న నిర్లక్ష్యం



దండేపల్లి/బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ రాంనగర్‌బస్తీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూరా పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి చిత్తడిగా తయారయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్‌పై తీగజాతి మొక్కలు ఎగబాకుతున్నాయి. దండేపల్లి మండలంలోని గూడెం గ్రామం ఉగ్గేవాడలో ఇళ్ల సమీపంలో గల త్రీఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ చుట్టూ చెట్ల తీగలు అల్లుకున్నాయి. మొక్కలు కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కుతున్నా విద్యుత్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు తొలగించేసి, కరెంట్ తీగలపై తీగజాతి మొక్కలు ఎగబాకకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నేరాల నియంత్రణే ప్రభుత్వ లక్ష్యం

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

మందమర్రిరూరల్: నేరాల నియంత్రణే ప్రభుత్వ లక్ష్యమని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియా విద్యానగర్, చెంచుకాలనీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సీఐ శశిధర్‌రెడ్డి, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు నేరస్తుల ఇళ్లలో పరిశీలించారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాలనీలో సరైన ధృవపత్రాలు, నంబర్లు లేని రెండు ఆటోలు, పది ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. మందమర్రి ఎస్సై రాజశేఖర్, కాసిపేట ఎస్సై ప్రవీణ్, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, మందమర్రి అదనపు ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

పనితీరుతోనే గుర్తింపు

- డీజీఎం(పర్సనల్) ఎస్.అనిల్‌కుమార్



శ్రీధర్‌ను సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: సరైన పనితీరుతోనే గుర్తింపు వస్తుందని డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్‌కుమార్ తెలిపారు. జీఎం కార్యాలయంలో విధినిర్వహణలో ప్రతిభ కనబరిచిన జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్‌ను గురువారం సన్మానించి ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్కే 6గని ఉద్యోగులను ఇతర గనులకు సర్దుబాటు చేయడంలో శ్రీధర్ ప్రత్యేక పనితీరును కనబరిచారన్నారు. కార్యక్రమంలో డీవైపీఎం దేవేందర్ రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

12న ఉచిత నేత్ర వైద్య శిబిరం

పాతమంచిర్యాల: లయన్స్ క్లబ్ మంచిర్యాల, లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ ఆధ్వర్యంలో ఈ నెల 12న జిల్లా కేంద్రంలోని సున్నంబట్టి వాడలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో రేకుర్తి కంటి ఆస్పత్రి వైద్యులు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డిస్ట్రిక్టు ప్రోగ్రాం చైర్‌పర్సన్ ఫర్ ఐ క్యాంప్స్ వి.మధుసూదన్ రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి గురువారం ఐ క్యాంప్ పోస్టర్ ఆవిష్కరించారు. పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డా.కిరణ్‌కుమార్, డా.సుగుణాకర్ రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు శివ్రప్రసాద్, వెంకటేశ్వర్లు, సత్యపాల్‌రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ముల్కలపేటలో ‘కమ్యూనిటీ కాంటాక్ట్’

వేమనపల్లి: మండలంలోని ముల్కలపేట గ్రామంలో నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడుంబా అమ్మకాల కోసం భార్యభర్తలు, కాలేజీ విద్యార్థులు పోలీసులకు అనుమానం రాకుండా బైక్‌లపై కాలేజీ బ్యాగుల్లో గుడుంబా ప్యాకెట్లు తీసుకొచ్చి గ్రామాల్లో అమ్ముతున్నారన్నారు. యువత, రాజకీయ నాయకులు, మహిళల సహకారంతో మండలాన్ని గుడుంబా రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. 100లీటర్ల గుడుంబా పానకం ధ్వంసం చేశారు. నాలుగు లీటర్ల గుడుంబా పట్టుకొని కేసు నమోదు చేశారు. 30బైక్‌లు స్వాధీనం చేసుకొని నంబర్ ప్లేట్లు లేని బైక్‌లను సీజ్ చేశారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై శ్యాంపటేల్



వేంపల్లిలో గురుపౌర్ణమి వేడుకల్లో అధ్యాపకులు, విద్యార్థులు



చెన్నూర్‌లో పూజలు



మంచిర్యాలటౌన్: గురువులను సన్మానిస్తున్న నాయకులు

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి

చెన్నూర్: పట్టణంలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సాయిబాబా ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఒడ్డెపల్లి కాలనీలో గల అభయాంజనేయ ఆలయంలో పోతులూరి వీరబ్రహేంద్ర స్వామి దీక్షపరులు గురుస్వామి ఏలేశ్వరం సుశీలాదేవిరమేశ్‌చారి దంపతులను శిష్య బృందం సభ్యులు శాలువతో సన్మానించారు. కార్యక్రమాల్లో అర్చకులు ఓంకార్ శర్మ, చంద్రశేఖర్, రమేశ్, సత్యానారాయణ పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని పొనకల్, రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం, సాయి బాబ ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

మంచిర్యాలటౌన్: బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో గురువులుగా ఉన్నవారిని గురువారం సన్మానించారు. కార్యక్రమంలో గర్మిళ్ల జోన్ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజు, ప్రధాన కార్యదర్శి మేరడికొండ శ్రీనివాస్, ఎనగందుల కృష్ణమూర్తి, పెద్దపల్లి పురుషోత్తం, సతీశ్‌రావు, వెంగపల్లి వెంకటేశ్వర్‌రావు, కర్రె లచ్చన్న, రెడ్డిమల్ల అశోక్, రాకేశ్ రెన్వా, రెడ్డిమల్ల అశోక్, తోట మల్లిఖార్జున్, బెల్లంకొండ మురళి, కేశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లి ఎస్ఆర్‌కేఎం నర్సింగ్ కళాశాలలో గురువారం గురుపౌర్ణమి వేడుకల్లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తున్న గురుపూజోత్సవం ఈ సారి మరింత వేడుకగా జరపగా, అనంతరం విద్యార్థులు పాఠాలు బోధించే గురువులను ఘనంగా సత్కరించారు. పలు సాంస్కృతిక కార్యకమాలతో అలరించారు. వేడుకల్లో కళాశాల కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు భాగస్వామ్యమయ్యారు.

విద్యార్థులు సికిల్ సెల్ పరీక్షలు చేయించుకోవాలి

జన్నారం: ఆశ్రమ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు సికిల్‌సెల్ అనీమియా పరీక్షలు చేయించుకోవాలని, సికిల్‌సెల్ పై అవగాహన కలిగి ఉండాలని హెల్త్ ఎడ్యూకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్ పేర్కొన్నారు. మండలంలోని కవ్వాల్ గిరిజన బాలికా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు గురువారం సికిల్ సెల్ అనీమియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గిరిజన బాలికా ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌చందర్, సూపర్‌వైజర్ రాంబాబు, హెల్త్ అసిస్టెంట్ మౌనిక, ఏఎన్ఎం ప్రవంతి, హెల్త్ అసిస్టెంట్ కమలాకర్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

పీహెచ్‌సీ సందర్శన

తాండూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి హరీష్‌రాజ్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. లేబర్ రూమ్ ఆపరేషన్ థియేటర్, మందులు పరికరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర రకాల జ్వరాలు రాకుండా ప్రభావిత గ్రామాల్లో ముందస్తు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న హరీష్‌రాజ్

ఆధ్యాత్మికం

అక్కెపల్లిలో మాంతమ్మ బోనాల జాతర



చెన్నూర్‌రూరల్: మండలంలోని అక్కెపల్లి గ్రామంలో ఆదివాసీల ఆరాధ్య దైవం అయిన మాంతమ్మ బోనాల జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. పూజారులు చెడంక బానక్క, శంకరయ్య ఆధ్వర్యంలో అమ్మవారికి పట్నాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు.

అమ్మవారికి బోనాలు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాత కేకే–3 సీఎస్పీ సమీపంలో శ్రీశ్రీశ్రీ విజయదుర్గ భవానీ అమ్మ వారికి ఆషాఢమాసం, గురుపౌర్ణమి సందర్భంగా బోనాలు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

పాతమంచిర్యాల: స్థానిక గోదావరి నదీ తీరంలోని గౌతమేశ్వర రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో మంచిర్యాల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 16జంటలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. మంచిర్యాల పట్టణ నూతన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కటకం హరీష్, కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

వేమనపల్లి/కాసిపేట: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అధికారులు సూచించారు. కాసిపేట మండలం మామిడిగూడ, వేమనపల్లి మండలం నీల్వాయిలో వనమహోత్సవం నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాసిపేట మండల ప్రత్యేకాధికారి పురుషోత్తంనాయక్, ఎంపీడీవో సత్యానారాయణసింగ్, ఎంపీవో షేక్ సబ్దర్ అలీ, ఏపీవో నవీన్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మినారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్వేత, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, వేమనపల్లిలో రేంజ్ అధికారి హఫీజొద్దీన్, ఎస్సై శ్యాంపటేల్, హెచ్ఎం శశిధర్‌రెడ్డి, డెప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్‌కుమార్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేంజ్ అధికారి హఫిజొద్దీన్

అధికారులు సరిచేయరూ..!



మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని శ్రీనివాస కాలనీలో డ్రెయినేజీ కోసం పైప్‌లైన్‌ను తవ్వుతుండగా మిషన్ భగీరథ పైపు ధ్వంసం అయ్యింది. దీంతో నీరు వృథాగా పోతుండడంతో సిబ్బంది డ్రెయినేజీ పనులను నిలిపివేసి వెళ్లారు. నీరు వృథాగా పోతుందని, కార్పొరేషన్ అధికారులు పట్టించుకొని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

జలశక్తి అభియాన్ కేంద్ర బృందం పర్యటన

నెన్నెల: జలశక్తి అభియాన్ పనుల పరిశీలనలో భాగంగా కేంద్ర ప్రభుత్వ బృందం గురువారం మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. భూగర్భ జలాల శాస్త్రవేత్త రాంబాబు బృందం ఉపాధి హామీలో జరిగిన నీటి సంరక్షణ పనులు, ఇంకుడుగుంతలు తదితర పనులు పరిశీలించారు. డీఆర్‌డీఓ నోడల్ అధికారి సదానందం, ప్లానిటేషన్ మేనేజర్ శ్రీనివాస్, ఎంపీడీఓ వీనావాణి, ఏపీఓ నరేష్ పాల్గొన్నారు.



ఇంకుడుగుంత పరిశీలిస్తున్న అధికారులు

ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలి

పాతమంచిర్యాల/చెన్నూర్: చెన్నూర్ గోదావరి నదిలో ఇసుకరీచ్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, చెన్నూర్ ఏరియా కార్యదర్శి బోడెంకి చందు అన్నారు. సీఐటీయూ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. చెన్నూర్ పట్టణంలో ప్రజల అవసరాల కోసం బతుకమ్మవాగు నుంచి ఇసుకను సరఫరా చేశారని, బతుకమ్మవాగులో ఇసుక లేకపోవడంతో ఇంటి నిర్మాణాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్టర్, ప్రజాప్రతినిధులు స్పందించి చెన్నూర్‌లో ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

దండేపల్లి: పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వివిధ పాఠశాలల్లో తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు నీలేష్‌కుమార్, మండల శాఖ అధ్యక్షుడు ఉప్పల రూపాచారి, ప్రధాన కార్యదర్శి యామసాని శ్రీనివాస్, నాయకులు బీస ఉమ, సంగోజు లక్ష్మణచారి తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ జాబితా ప్రదర్శన

తాండూర్: తాండూర్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న డే వాచ్ ఉమెన్, అసిస్టెంట్ కుక్, స్కావెంజర్, స్వీపర్ పోస్టుల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరినట్లు ఎంఈవో మల్లేశం తెలిపారు. మెరిట్ జాబితాను తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజాపరిషత్ కార్యాలయం, తాండూర్ మండల విద్యా వనరుల కేంద్రం, కేజీబీవీలలో గురువారం ప్రదర్శించినట్లు ఆయన తెలిపారు.

జిల్లా వాసులకు డాక్టరేట్

మంచిర్యాలఅర్బన్/జన్నారం/మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నర్సింగాపూర్‌కు చెందిన తోడేటి సత్యనారాయణ, జన్నారం మండలం కలమడుగు నివాసి ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, మంచిర్యాలకు చెందిన రివిలేషన్ స్కూల్ కరస్పాండెంట్, విద్యావేత్త రాపోలు విష్ణువర్ధన్‌రావు బుధవారం రాత్రి హైదరాబాద్‌లో గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు.

యువత రక్తదానం

నెన్నెల: మండలంలో గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్ పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ నాయకులు, యువకులు ఘనంగా నిర్వహించారు. నెన్నెల పీహెచ్‌సీలో 50మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

17న ఆసరా పింఛన్‌దారుల సదస్సు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఈ నెల 17న మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఆసరా పింఛన్‌దారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ సభ్యులు పెద్దపల్లి సత్యనారాయణ తెలిపారు.



మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీలో గురువారం మహిళలు గోరింటాకు సంబురాలను జరుపుకున్నారు. ఏకే ఫౌండేషన్ ఫౌండరల్ లత జెట్టి ఆధ్వర్యంలో మహిళలు అంతా ఒకచోట చేరి గోరింటాకు పెట్టుకున్నారు.